క్లుప్తంగా

పీర్ల పండుగకు రావాలని మంత్రి ఉత్తమ్‌కు ఆహ్వానం

హుజూర్‌నగర్ : పట్టణంలో ఈ నెల 7వ తేదీ నుంచి 17 వరకు జరిగే పీర్ల పండుగకు హాజరు కావాలని మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతిలకు ముజావర్ షేక్ సైదా గురువారం హుజూర్‌నగర్‌లో ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో ముజావర్లు షేక్ మొయిన్, షేక్ నాగుల్ మీరా, మీరా పాషా, ఖాసీం సాబ్, నాయకులు వల్లపుదాసు కృష్ణగౌడ్, పాలకూరి బాబు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి పలువురి వినతి

హుజూర్‌నగర్ : రాష్ట్రంలో వీఆర్‌ఓలను పునరుద్ధరించాలని కోరుతూ వీఆర్‌ఓ అసోసియేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ డివిజన్ అధ్యక్షుడు జానీపాష, శివకుమారిలు గురువారం హుజూర్‌నగర్ వచ్చిన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా చెరువు మట్టిని అక్రమంగా తలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు మంత్రికి ఫిర్యాదు పత్రం అందజేశారు.

హజ్ యాత్ర పవిత్రమైనది



మజీద్ కుటుంబసభ్యులను సన్మానిస్తున్న ముస్లింలు

హుజూర్‌నగర్ : హజ్ యాత్ర పవిత్రమైనదని ముస్లింల మతపెద్ద ముఫ్తీ మహమ్మద్ గౌసుద్దీన్ అన్నారు. హజ్ యాత్ర ముగించుకుని వచ్చిన అబ్దుల్ మజీద్ కుటుంబసభ్యులను గురువారం హుజూర్‌నగర్‌లోని మజీద్‌లో ఆయన సన్మానించారు. ముస్లిం నాయకులు ఎండీ అజీజ్ పాషా, కాంగ్రెస్ నాయకుడు సుబ్బరాజు, గౌస్ మౌలానా, రసూల్, రహమతుల్లా, మౌలానా, అష్రఫ్ అలీ, ఉద్దండు, జావిద్, ఫరీద్, సిరాజ్, జాకీర్, రషీద్, ఖాసీం, హిజ్రి మేస్త్రి తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న హెచ్‌ఎంకు సన్మానం



సైదానాయక్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గరిడేపల్లి : మండలంలోని పరెడ్డిగూడెంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుగులోతు సైదానాయక్ పెన్‌పహాడ్ మండలం లింగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతిపై వెళ్లారు. గురువారం ఆయనను మాజీ సర్పంచ్ వీరంరెడ్డి లక్ష్మీశంభిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ చత్రునాయక్, సర్వారం పీఏసీఎస్ చైర్మన్ వీరంరెడ్డి శంభిరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు రజిత, ఉపాధ్యాయురాలు సునీత, మేకల మల్లారెడ్డి, కందుల వెంకటరెడ్డి, విద్యా కమిటీ మాజీ చైర్మన్ మరియమ్మ, అంగన్‌వాడీ టీచర్ సురభి సుగుణ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తిచేయాలి



డబుల్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని శ్రీనివాసపురం వద్ద జరుగుతున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులను గురువారం జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. రూ. 20 కోట్లతో చేపట్టిన లింగగిరి– యాతవాకిళ్ల డబుల్ రోడ్డు పనులు, రూ. 66 లక్షలతో శ్రీనివాసపురంలో చేపట్టిన బ్రిడ్జి, అమరవరంలో రూ.96 లక్షలతో చేపట్టిన బ్రిడ్జి పనులను వెంటనే పూర్తిచేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను కోరారు. ఆయన వెంట రైతులు, వాహనదారులు ఉన్నారు.

ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థికి అభినందన



ఉదయశ్రీని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పత్తిపాటి ఉదయశ్రీ పదవ తరగతి పరీక్షలో 9.7 జీపీఏ సాధించి రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీస్ (ట్రిపుల్ ఐటీ) బాసరలో ఇంజనీరింగ్ ఇంటిగ్రేటెడ్ కోర్స్ సీటు సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎల్.శ్రీనివాస్‌రావు శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి. రాఘవారెడ్డి, ఎల్.గోపయ్య, కేఆర్ శ్యాందర్ రావు, కె.యాదయ్య, అనిల్‌కుమార్, సైదులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి

- రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



పాలకవీడులో ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఉత్తమ్



నేరేడుచర్ల : సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మేళ్లచెరువు : దక్షిణ రాజగోపురం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నేరేడుచర్ల : మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పనిచేయాలని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం నేరేడుచర్ల మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్‌తో కలిసి అభివృద్ధి పనులపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరేడుచర్ల మున్సిపాలిటీ అభివృద్ధికి గతంలో రూ.15 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. 1.30 కోట్లతో ఆర్‌– 3 కెనాల్ నుంచి శిశు బాల మందిర్ స్కూల్ వరకు సీసీ రోడ్డు, రూ.2 కోట్లతో శాంతినగర్ నుంచి కమలానగర్ వరకు సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం, రూ.40 లక్షలతో టౌన్ హాల్ పనులను తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు. సంబంధిత పనులకు వెంటనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురైతే చర్యలు తీసుకోవాలని, పన్ను వసూలు నిర్దేశించిన మేర వసూలు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి, వైస్ చైర్మన్ అలక సరితసైదిరెడ్డి, కౌన్సిలర్లు రణపంగ నాగయ్య, సయ్యద్ బాష, వేమూరి నాగవేణి, బానోతు లలిత, షహనాజ్, బైరెడ్డి జితెందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయలక్ష్మి, తహసీల్దార్ సైదులు, పబ్లిక్ హెల్త్ ఈఈ సత్యనారాయణ, డీఈ రమాదేవి, ఏఈ స్వాతి, ట్రాన్స్‌కో ఏడీఏ సక్రునాయక్, అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పాలకవీడు : మండలంలో రూ.22.73 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులకు గురువారం రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. తహసీల్దార్, పోలీస్‌స్టేషన్, మండల పరిషత్ కార్యాలయాల భవనాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాలు, పాలకవీడు నుంచి అలింగాపురం డబుల్ రోడ్డు, బెట్టెతండా నుంచి శూన్యపహాడ్ రోడ్డు, జాన్‌పహాడ్ వద్ద వాగుపై హైలెవల్ వంతెన, సింగారం– రోళ్లవారిగూడెం రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కాగా, జాన్‌పహాడ్ వద్ద కృష్ణానదిపై నిర్మాణంలో ఉన్న ఎత్తిపోతల పథకం సామర్థ్యాన్ని పెంచి జాన్‌పహాడ్ మేజర్ కాల్వ పరిధిలోని ఎల్‌– 14 కాలువ వరకు నీటిని అందించాలని పలువురు నాయకులు కోరడంతో మంత్రి సానుకూలంగా స్పందించి నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీపీ భూక్యా గోపాల్, జెడ్పీటీసీ మాళోతు బుజ్జి మోతీలాల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎన్‌వీ.సుబ్బారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బెల్లంకొండ విజయలక్ష్మి, సప్పిడి నాగిరెడ్డి, బైరెడ్డి జితేందర్‌రెడ్డి, మీసాల ఉపేందర్, మండల మహిళా అధ్యక్షురాలు జ్యోతి, ఉపేందర్‌రావు, నీమానాయక్, వెచ్చా సందీప్, తీగల శేషురెడ్డి, బూషిపల్లి వెంకట్‌రెడ్డి, పుట్టూరి నర్సిరెడ్డి, మునగాల భాస్కర్‌రెడ్డి, అందె రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, పార్టీ గ్రామ శాఖ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్మశానవాటిక పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

హుజూర్‌నగర్ : పట్టణ పరిధిలోని ఫణిగిరి గుట్ట వద్ద రూ.50 లక్షలతో ఏర్పాటు చేస్తున్న క్రిస్టియన్ శ్మశాన వాటిక పనులను త్వరితగతిన పూర్తిచేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం శ్మశాన వాటిక పనులను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న, మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన రవి, వైస్ చైర్మన్ సంపత్‌రెడ్డి, ఎంపీపీ గూడెపు శ్రీను, మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, నాయకులు ఆదెర్ల శ్రీనివాసరెడ్డి, శివరాంయాదవ్, అజీజ్‌పాషా, వి.కృష్ణ, ఆర్‌అండ్‌బీ ఈఈ భాస్కర్‌రావు, డీఈ రమేష్, ఆర్డీఓ శ్రీనివాసులు, పాస్టర్స్ యూనియన్ నాయకులు డేవిడ్ రాజు, సుధాకర్, గుండ సామ్యూల్, ఉదయబాబు, తదితరులు పాల్గొన్నారు.

రాజగోపురం నిర్మాణానికి శంకుస్థాపన

మేళ్లచెరువు: మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత స్వయంభు శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.55లక్షలతో చేపట్టిన దక్షిణ వైపు రాజగోపురం నిర్మాణానికి మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా మండల కేంద్రంలో రూ.1.50కోట్లతో ముస్లింల షాదీఖానా నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయన వెంట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ మహేంద్రకుమార్, తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ ఖాజా అస్గర్ అలీ, మాజీ ఎంపీపీ కొట్టె పద్మసైదేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ పద్మాగోవిందరెడ్డి, కాకునూరి భాస్కరరెడ్డి, రామకృష్ణారెడ్డి, పోశం వెంకటరెడ్డి, చందర్‌రావు, ఈఓ కొండారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

మండల ప్రత్యేకాధికారులు బాధ్యతల స్వీకరణ



హుజూర్‌నగర్‌రూరల్ : బాధ్యతలు స్వీకరిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు



నడిగూడెం : బాధ్యతలు స్వీకరిస్తున్న సతీష్‌కుమార్



మఠంపల్లి : బాధ్యతలు స్వీకరిస్తున్న సంధ్యారాణి



కోదాడరూరల్ : సూర్యనారాయణకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు, సిబ్బంది

కోదాడరూరల్ : మండల పరిషత్ అధ్యక్షుల పదవీకాలం ముగియడంతో కోదాడ మండల పరిషత్ ప్రత్యేక అధికారిగా స్థానిక ఆర్డీఓ సూర్యనారాయణ నియమితులయ్యారు. గురువారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు ఎంపీడీఓ రాంచందర్‌రావు, ఎంపీఓ పాండురంగన్న, సిబ్బంది, కార్యదర్శులు శుభాకాంక్షలు తెలిపారు.

మునగాల మండల ప్రత్యేక అధికారిగా శిరీష

మునగాల : ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుల పదవీకాలం గురువారం ముగియడంతో మునగాల మండల ప్రత్యేక అధికారిగా జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీషను జిల్లా కలెక్టర్ నియమించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, ఎంపీపీ ఎలక బిందు, జెడ్పీటీసీ సభ్యురాలు దేశిరెడ్డి జ్యోతి, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ ప్రత్యేకాధికారిగా శ్రీనివాసులు

హుజూర్‌నగర్‌రూరల్ : ఎంపీపీ పదవీకాలం ముగియడంతో మండల ప్రత్యేక అధికారిగా హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పిండిప్రోలు లావణ్య, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

నడిగూడెం ప్రత్యేక అధికారిగా సతీష్‌కుమార్

నడిగూడెం : మండల పరిషత్ అధ్యక్షురాలు, సభ్యుల పదవీ కాలం ముగియడంతో నడిగూడెం మండల ప్రత్యేక అధికారిగా జిల్లా అటవీ శాఖ అధికారి వి.సతీష్‌కుమార్ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్‌డి.ఇమామ్, ఎంపీఓ దుర్గాప్రసాద్ ఉన్నారు.

మఠంపల్లి ప్రత్యేకాధికారిగా సంధ్యారాణి

మఠంపల్లి : ఎంపీపీ పదవీ కాలం ముగియడంతో మఠంపల్లి మండల ప్రత్యేక అధికారిగా వ్యవసాయ శాఖ హుజూర్‌నగర్ ఏడీఏ సంధ్యారాణి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి మద్దుల వెంకటేశ్వర్లు, సీఓ దారా రాంబాబు పాల్గొన్నారు.

చిలుకూరు ప్రత్యేకాధికారిగా రూపేందర్‌సింగ్

చిలుకూరు : చిలుకూరు మండల పరిషత్ ప్రత్యేక అధికారిగా జిల్లా మత్స్యశాఖ అధికారి రూపేందర్ సింగ్ గురువారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గిరిబాబు, కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

మేళ్లచెరువు మండల ప్రత్యేకాధికారిగా పద్మ

మేళ్లచెరువు : ఎంపీపీ పదవీకాలం ముగియడంతో మేళ్లచెరువు మండల ప్రత్యేకాధికారిణిగా డీసీఓ ఎస్.పద్మ గురువారం బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



చిలుకూరులో బాధ్యతలు స్వీకరిస్తున్న రూపేందర్‌సింగ్



మునగాల : బాధ్యతలు స్వీకరిస్తున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష



మేళ్లచెరువు : బాధ్యతలు స్వీకరిస్తున్న పద్మ

పదెకరాలలోపు రైతు భరోసా ఇవ్వాలి

కోదాడరూరల్ : రైతు భరోసా పథకం అమలుపై కోదాడ మండలంలోని చిమిర్యాల పీఏసీఎస్‌లో గురువారం ప్రత్యేక మహాజన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పదెకరాల లోపు వ్యవసాయ భూములకే రైతు భరోసా ఇవ్వాలని ఎక్కువ మంది రైతులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పిల్లల ఉన్నత చదువులకు, ఇంటి లోన్, దీర్ఘకాలిక రుణాల కోసం ఐటీ చెల్లించేవారిలో పదెకరాల లోపు ఉన్న రైతులకు భరోసా ఇవ్వాలన్నారు. రియల్ ఎస్టేట్, వ్యవసాయేతర భూములకు ఇవ్వొద్దని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహకార బ్యాంకు ఆడిటర్ జి.శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కొత్త రఘుపతి, ఏటపాలెం రజని, ఏఈఓ ఝాన్సీ, సీఈఓ జొన్నలగడ్డ జయకృష్ణ, డైరెక్టర్లు ఉన్నారు.

రైతు ప్రజాభిప్రాయ సేకరణ

మేళ్లచెరువు : రైతు భరోసా పథకం అమలుపై మేళ్లచెరువు మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, సంఘం పాలకవర్గ సభ్యుల అభిప్రాయాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి ఎస్.పద్మ, మండల వ్యవసాయాధికారి పెద్ది శ్రీనివాస్‌గౌడ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ అంజయ్య, అంబేద్కర్, కాకునూరి శంభిరెడ్డి, సీఈఓ వెంకటరెడ్డి రైతులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో 'మౌంట్‌ఫోర్ట్' విద్యార్థుల ప్రతిభ

మఠంపల్లి : సూర్యాపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌లో భాగంగా గురువారం నిర్వహించిన అథ్లెటిక్స్‌లో మండల కేంద్రంలోని మౌంట్ ఫోర్ట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు పీఈటి సతీష్ గురువారం విలేకరులకు తెలిపారు. అండర్ –10 విభాగంలో 4వ తరగతి విద్యార్థి ప్రవీణ్, అండర్– 12 విభాగంలో 7వ తరగతి విద్యార్థి అన్విత‌లు 100 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్‌లలో ప్రథమ స్థానం సాధించారన్నారు. వీరు జూలై 7న హైదరాబాద్‌లోని గచ్చిబౌలీ స్టేడియంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ బ్రదర్ వినోద్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి

హుజూర్‌నగర్‌రూరల్ : అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తాగునీటి సౌకర్యార్థం ఇటీవల వేసిన బోరును ఆయన ప్రారంభించి మాట్లాడారు. మండల వైద్యాధికారిణి డాక్టర్ పుష్పలత, మిషన్ భగీరథ ఏఈ శ్యామల, పద్మ, రాజేంద్రప్రసాద్, ఆరోగ్య సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సెలవుల్లో ఆర్‌ఐలు.. ప్రజలకు ఇబ్బందులు

మఠంపల్లి : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఇద్దరు ఆర్‌ఐలు సెలవుల్లో ఉండడంతో ధృవీకరణ పత్రాలు సకాలంలో అందక ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయమై తహసీల్దార్ మంగా రాథోడ్‌ను గురువారం వివరణ కోరగా కార్యాలయంలో ఇద్దరు ఆర్‌ఐలు ఉన్నారని, వారిలో ఒకరు సుమారు 18 నెలల క్రితం అనారోగ్య కారణంతో సెలవు పెట్టారన్నారు. మరో ఆర్‌ఐ కూడా అనారోగ్య కారణాలతో 15 రోజులు సెలవు పెట్టారని తెలిపారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తాత్కాలిక ఆర్‌ఐని నియమించాలని కోరినట్లు తెలిపారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం



కోదాడలో విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

మునగాల : నీట్ పరీక్ష పేపర్ లీకేజీని నిరసిస్తూ గురువారం ఏఐఎస్‌ఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో మునగాల మండలంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు శివ మాట్లాడుతూ.. నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎం.యశ్వంత్, అమరగాని శివ, వెంకటేష్, ఏ.చందు, ముస్తఫా, సందీప్, వాసు, గోపి పాల్గొన్నారు.

నేరేడుచర్ల : నీట్ పరీక్ష పత్రం లీకేజీని నిరసిస్తూ గురువారం నేరేడుచర్లలో ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్, డీవైఎఫ్‌ఐ, ఎస్ఎఫ్‌యూఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ విజయవంతమైంది. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, డీవైఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి ఎడ్ల సైదులు, ఎన్ఎస్‌యూఐ నాయకుడు ఎస్‌కే ఇస్తియాక్‌లు, మచ్చ రవి, సుబ్బు, సతీష్, సాత్విక, అరుణి, ఆకిరానందన్, వేదాంత్ తదితరులు ఉన్నారు.

నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలి

గరిడేపల్లి : నీట్ పరీక్షలను మళ్లీ నిర్వహించాలని పీవైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి కామళ్ల సుందరయ్య, పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి ఉదయ్ అన్నారు. పరీక్ష పేపర్ లీకేజీ అయినా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ గురువారం మండలంలోని వెలిదండలో విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో విద్యా సంస్థల బంద్ నిర్వహించారు. పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు వల్లపుదాసు నరేష్, శ్రీను, అచ్యుత్, సిద్ధూ, చరణ్ పాల్గొన్నారు.

కోదాడ : నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేస్తూ గురువారం కోదాడలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకుడు చేపూరి కొండలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అసమర్థతతో నీట్ పరీక్షకు ముందే పేపర్ లీక్ అయ్యిందని ఆరోపించారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలి

చిలుకూరు : గతంలో జరిగిన నీట్ పరీక్షను రద్దు చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి చేపూరి కొండలు డిమాండ్ చేశారు. గురువారం చిలుకూరు మండలంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో విద్యాసంస్థలను బంద్ చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తమ్మనబోయిన నరేష్, మండల అధ్యక్ష, కార్యదర్శులు అనంతుల రాము, కడారు రాము, చందుకుమార్ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల బంద్ ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ, వైజేఎస్ నాయకులు మీసాల వీరబాబు చందర్‌రావు, భిక్షం నాయక్‌లు మాట్లాడుతూ నీట్ పరీక్షల్లో అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జీతో విచారణ జరిపించాలని అన్నారు. భాను, ప్రవీణ్, చరణ్, ఉదయ్, గోపి, అబ్రహం, శ్రీను, గోపి సతీష్, జ్యోతి, మంజుల, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు ఆత్మీయ వీడ్కోలు



మునగాల : ఎంపీపీ ఎలక బిందు - నరేందర్‌రెడ్డి దంపతులను సత్కరిస్తున్న అధికారులు, సిబ్బంది



మునగాల : జెడ్పీటీసీ సభ్యురాలు దేశిరెడ్డి జ్యోతిని సత్కరిస్తున్న అధికారులు



హుజూర్‌నగర్ : ఎంపీపీ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ పాలకవర్గ సభ్యులు

మునగాల : మునగాల మండల పరిషత్ పాలకవర్గ పదవీకాలం పూర్తికావడంతో గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఎలక బిందు, జెడ్పీటీసీ సభ్యురాలు దేశిరెడ్డి జ్యోతి, ఎంపీటీసీ సభ్యులతో పాటు తాజా మాజీ సర్పంచ్‌లను శాలువాలతో సత్కరించారు. అనంతరం పలువురు ఎంపీటీసీలు మాట్లాడుతూ తమ ఐదేళ్ల పదవీకాలంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు రాక తమను గెలిపించిన ప్రజలకు ఏమీ చేయలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ.. గ్రామాల్లో చేపట్టిన పనులకు నేటికీ పూర్తిస్థాయిలో బిల్లులు రాక అప్పులపాలయ్యామన్నారు. చివరగా ఎంపీపీ ఎలక బిందు మాట్లాడుతూ చిన్న వయస్సులో ఎంపీపీ పదవీ చేపట్టిన తాను ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో మండలాభివృద్ధికి కృషిచేశానని భావోద్వేగంతో కన్నీరు పెట్టుకున్నారు. కాగా, పలువురు మహిళా ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు బదులు వారి భర్తలు సమావేశంలో పాల్గొని మాట్లాడడం కొసమెరుపు. ఈ సమావేశంలో ఎంపీడీఓ కె.రమేష్ దీనదయాళ్, ఎంపీఓ భూపాల్‌రెడ్డి, తహసీల్దార్ వి.ఆంజనేయులు, వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య, సొసైటీ చైర్మన్లు కందిబండ సత్యనారాయణ, చందా చంద్రయ్య, వి.రావిరెడ్డి, తొగరు సీతారాములు, తాజా మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు పార్టీల నాయకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీపీ గూడెపు శ్రీనివాస్‌కు సన్మానం

హుజూర్‌నగర్ : ఐదేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న ఎంపీపీ గూడెపు శ్రీనివాసును గురువారం హుజూర్‌నగర్ మున్సిపల్ చైర్మన్ గెల్లి అర్చనరవి, వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డిల ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు ఎంపీపీని సత్కరించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న, కౌన్సిలర్లు కె.శ్రీనివాసు, వి.నాగేశ్వరరావు, డి.మంగమ్మ, వి.వరలక్ష్మి, బి.ధనమ్మ, సౌజన్య, ఫణికుమారి, కె.శ్రావణ్‌కుమార్, వి.సరిత, మంజుల, రామ్‌గోపి, ఎ.సతీష్, గంగరాజు, విజయ్ పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఐక్యతకు మోహనరంగా కృషి



కోదాడరూరల్ : మోహనరంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మున్నూరు కాపు నాయకులు

హుజూర్‌నగర్ : బడుగు బలహీన వర్గాల ఐక్యత కోసం కృషి చేసిన వ్యక్తి వంగవీటి మోహనరంగా అని కాపు సంఘం నాయకులు అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో మోహనరంగా జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం పట్టణ అధ్యక్షుడు ధూళిపాల శ్రీనివాస్, నాయకులు రాయల వెంకటేశ్వర్లు, జి.సత్యనారాయణ, పి.రవి, శేఖర్, కొట్టు బాబు, రాంబాబు, నాగేశ్వరరావు, వెంకయ్య, మోహనరావు, గోపి, దీప పాల్గొన్నారు.

కోదాడ పట్టణంలో..

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలో వంగవీటి మోహనరంగా 77వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌చౌక్‌లో ఆయన విగ్రహానికి మున్నూరు కాపు సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం కోదాడ పట్టణ అధ్యక్షుడు సన్నీరు మురళి, నూనె సులోచన, బండ్ల కోటయ్య, కంబాల ప్రసాద్, హనుమంతరావు తదితరులు ఉన్నారు.

ఆలీస్ మద్దినేని జన్మదిన వేడుకలు

గరిడేపల్లి : మండలంలోని రాయినిగూడెంలో గల సువార్త చర్చిలో జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ దుర్గం ప్రభాకర్ ఆధ్వర్యంలో గురువారం సిస్టర్ ఆలీస్ మద్దినేని, ఆస్ట్రేలియా ప్రేయర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లకు సఫారీ సూట్స్ అందించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ స్టీవెన్సన్, ఉమ్మడి నల్లగొండ గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అల్లం ప్రభాకర్‌రెడ్డి, క్రైస్తవ నాయకుడు పోకల అశోక్, సువార్త చర్చి తెలుగు రాష్ట్రాల కోఆర్డినేటర్ పాస్టర్ సీహెచ్.శ్యామ్‌ప్రసాద్, బిషప్ జాన్ కాంతారావు, జీఆర్ అబ్రహం, సుందర్‌రావు, డేవిడ్‌నాయక్, అనకాలి స్టీవెన్, దెబోరా స్టివెన్, మిస్సెస్ దానం, జాషువా, రామాంజనేయులు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నేరేడుచర్ల : పట్టణంలోని జాన్‌పహాడ్ రోడ్డు విస్తరణలో భాగంగా నేరేడుచర్ల టౌన్–1 ఫీడర్ పరిధిలోని మజీద్ పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మారుస్తున్నందున శుక్ర, శనివారాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ పందిరి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు విద్యుత్ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

దొడ్డి కొమురయ్య జీవితం స్ఫూర్తిదాయకం



మునగాల : దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



కోదాడరూరల్ : దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మునగాల : దొడ్డి కొమురయ్య జీవితం స్ఫూర్తిదాయకమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యుడు దేవరం వెంకటరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అమరవీరుల స్మారక భవనంలో కొమురయ్య 78వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొక్కిరేణిలో మహిళా సంఘం ఆధ్వర్యంలో కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో డీవైఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు తుమ్మ సతీష్, వట్టెపు చినసైదులు, మండల కార్యదర్శి చందా చంద్రయ్య, మండల కమిటీ సభ్యులు షేక్ సైదా, గోపిరెడ్డి వెంకటరెడ్డి, బోళ్ల కృష్ణారెడ్డి, వెంకన్న, జ్యోతి, గురోజీ, మహిళా సంఘం నాయకురాళ్లు ఎల్లమ్మ, ఉమ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని శ్రీనివాసపురంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలను గురువారం సీపీఎం మండల కార్యదర్శి పోషణబోయిన హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ మండల కమిటీ సభ్యురాలు తంగెళ్ల వెంకటచంద్ర, సీఐటీయూ మండల కన్వీనర్ బండి గోపి, వెంకటేశ్వర్లు, సైదమ్మ, తిరుపతమ్మ, లక్ష్మి, రాములమ్మ, వెంకటమ్మ, మదార్‌సాహెబ్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య ఆశయాలు సాధించాలి

కోదాడరూరల్ : పెత్తందారి, రాజరిక వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి ప్రజలను చైతన్యం చేసిన వ్యక్తి దొడ్డి కొమురయ్య ఆశయాలను సాధించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.ముత్యాలు, సీనియర్ నాయకుడు డాక్టర్ సూర్యనారాయణ అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని సుందరయ్య భవన్‌లో కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దాసరి శ్రీనివాస్, సీహెచ్.బీమయ్య, మరియన్న, గోపి, పద్మ, తదితరులు ఉన్నారు.

గరిడేపల్లి : మండలంలోని అబ్బిరెడ్డిగూడెంలో సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌కే యాకూబ్ ఆధ్వర్యంలో గురువారం దొడ్డి కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సైదమ్మ, జిలకర పెంటయ్య, పందిరి వీరారెడ్డి, వీరమ్మ, భాగ్యమ్మ, ప్రవీణ్, సోమయ్య, విజయ్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెం : మండలంలోని వేణుగోపాలపురంలో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బెల్లకొండ సత్యనారాయణ, నాయకులు సంపతి పిచ్చయ్య, వెంకటేష్, నర్సయ్య, వీరబాబు, సైదమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.